క్లుప్తంగా

బాణసంచా అంగళ్లకు ఆర్డీవో అనుమతి ఉండాలి
తహసీల్దార్ నాగరాజు



క్రోసూరు: దీపావళి పండుగ సందర్భంగా మండలంలో బాణసంచా వ్యాపారులు సత్తెనపల్లి ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుని లైసెన్స్ పొందాలని తహసీల్దార్ వి.వి.నాగరాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వివరిస్తూ లైసెన్స్ పొందిన వ్యాపారికి పోలీసులు, రెవెన్యూ, ఫైర్ శాఖల అనుమతితో దీపావళి టపాసుల విక్రయాల స్టాల్ పెట్టుకునేందుకు స్థలం కేటాయిస్తారన్నారు. లైసెన్సు పొందకుండా అనధికారికంగా దీపావళి మందుల విక్రయ స్టాల్ నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.

అమరావతి: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ సోమవారం దీపావళి పండుగ సందర్భంగా మండలంలో దీపావళి బాణసంచా తాత్కాలిక దుకాణాలకు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని తహసీల్దార్ డానియెల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి, కార్యాలయంలో అర్జీ ఇచ్చి లైసెన్స్ తీసుకోవాలని సూచించారు.

వసతి గృహాల్లో వైద్య సిబ్బంది పరిశీలన



బెల్లంకొండ: మండలంలోని పలు వసతి గృహాలను గురువారం చంద్రాజుపాలెం పీహెచ్‌సీ సిబ్బంది పరిశీలించారు. పాపాయపాలెం బీసీ హాస్టల్, బెల్లంకొండలోని గురుకుల హాస్టల్, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. హాస్టళ్లలో వాటర్ ట్యాంకులను, సైడ్ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. అనారోగ్యంగా ఉన్నా, కొద్దిపాటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మణికుమారి, సూపర్‌వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఏఎన్ఎంలు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో వసతులు మెరుగుపరచాలి
గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనునాయక్

చిలకలూరిపేట: గిరిజన గురుకులాల్లో వసతుల మెరుగుకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చిత్తశుద్ధితో కృషి చేయాలని సీపీఐ అనుబంధ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీనునాయక్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన వసతి గృహాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని గిరిజన గురుకులాలు, వసతి గృహాలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సందర్శించాలని కోరారు. గిరిజన పాఠశాలల భవనాలకు నిధులు ఎందుకు కేటాయించటం లేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మన్యం జిల్లాలోని కురుపాంలో అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన గిరిజన శాఖ మంత్రి మరుగుదొడ్ల వలన రోగాలు వ్యాపిస్తున్నాయని చెప్పడం పరిస్థితులకు అద్దం పట్టిందన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రవాణా రంగానికి మేలు

చిలకలూరిపేట: జీఎస్టీ తగ్గింపు రవాణా రంగానికి మేలు చేస్తుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై లైట్ కమర్షియల్ వెహికిల్స్ ర్యాలీని గురువారం నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ రఫాని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1500 సీసీ సామర్థ్యం కలిగిన వాహనాలపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించటతో రవాణా రంగానికి తోడ్పాటు అందించినట్లు అవుతుందని వెల్లడించారు.

వాహనమిత్ర అర్జీలపై కూటమి నేతల పెత్తనం
ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: అర్జీని పక్కనపెట్టి వాహనమిత్ర అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన కేసానుపల్లి సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో టీవీ కృష్ణకుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు. కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని లలితాదేవి కాలనీలో మన్యం హుస్సేన్ గత 25 సంవత్సరాలుగా జీవనోపాధి కోసం ఆటో నడుపుతున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన వాహనమిత్ర పథకం కోసం ఆటో రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలతో గత నెల 20వ తేదీన సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. రాజకీయ కారణాలతో సచివాలయ సిబ్బంది అర్జీని ఆన్‌లైన్ చేయలేదు. దీనిపై ఎంపీడీవోకు అర్జీలు పెట్టినా స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హుడైన బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు స్పందించకపోవడంపై ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

పేదలకు వైద్య విద్య దూరం




కుందురువారిపాలెంలో కోటిసంతకాల సేకరణలో డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, పార్టీ నేతలు; రాజుపాలెంలో పత్రాలను అందజేస్తున్న దృశ్యం

- డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి
- కుందురువారిపాలెం, రాజుపాలెంలో కోటి సంతకాల సేకరణ

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి పేదలపై కనికరం లేదని, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు మెడికల్ విద్య అందకుండా ప్రైవేటు పరం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి అన్నారు. ప్రైవేట్‌పరం చేస్తే పేదలకు వైద్య విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో గురువారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌భార్గవరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తమ అనుచరులకు కట్టబెట్టేందుకే వైద్య విద్య ప్రైవేటీకరణ విధానాన్ని తీసుకువస్తున్నాడన్నారు. దీంతో ప్రతిభ ఉన్న విద్యార్థులకు వైద్య విద్య అందకపోగా, పేదలకు మెరుగైన వైద్యం కూడా దూరమవుతుందన్నారు.

ప్రైవేటీకరణ ఉపసంహరించే వరకు ఉద్యమం

పేదలకు అందాల్సిన వైద్యవిద్యను దూరం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామన్నారు. దీనిలో భాగంగా సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చయికం వెంకటప్పారెడ్డి, ఎంపీటీసీ మేడా వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, బత్తుల బాలకోటి, కుందురు శ్రీనివాసరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మేడా వీరాంజనేయులు, బత్తుల సాంబశివరావు, చింకా జగన్‌మోహన్‌రావు, కొండ్రాతి శ్రీనివాస్, సురేంద్ర, ఏరువ అప్పిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చావా రమేష్‌బాబు, కళ్ళం శివరామిరెడ్డి పాల్గొన్నారు.



సంతకాలు చేసిన పత్రాలు చూపిస్తున్న సుధీర్‌భార్గవరెడ్డి, ఇతర నాయకులు

రాజుపాలెంలో..

రాజుపాలెం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే పేద ప్రజలు వైద్యానికి, విద్యకు దూరమవుతారని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవరెడ్డి అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం రాత్రి రాజుపాలెంలో కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చారన్నారు. వీటిలో ఐదు కాలేజీలు ప్రారంభించారన్నారు. అందులో భాగంగా 10 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే కోట్లాది రూపాయలకు మెడికల్ సీట్లు అమ్ముకుంటారని ధ్వజమెత్తారు. కూటమి నిర్ణయానికి వ్యతిరేకంగా గ్రామస్తులతో సంతకాలు చేయించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు జంగం నరసింహారావు, పాలువాయి ఆదినారాయణ, బత్తుల శివయ్య, పొత్తూరి రామకృష్ణ, చెవుల స్వామి, జంగం శ్యాంబాబు, మద్రిబోయిన వెంకటప్పయ్య, పొత్తూరి నరసింహారావు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, దియ్యా కొండయ్య, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, బండి కోటినాగిరెడ్డి, పత్తిపాటి కోటేశ్వరరావు, పక్కావుల కోటేశ్వరరావు, ఎస్‌కె బాషా, ఎస్‌కే జానీ, చింతచెట్టు సుభాని, గాసి నరసింహారావు, నామాల కోటయ్య ఉన్నారు.

నేడు 12వ సచివాలయ పరిధిలో కోటి సంతకాల సేకరణ

సత్తెనపల్లి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధిష్ఠానం పిలుపు మేరకు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని 19, 20 వార్డుల్లో బ్రహ్మంగారి దేవస్థానం వద్ద జరిగే కోటిసంతకాల సేకరణను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి గురువారం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, నేతలు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పాలిథిన్ వినియోగంతో పర్యావరణ కాలుష్యం

సత్తెనపల్లి: పాలిథిన్ వినియోగంతో పర్యావరణం కలుషితమవుతుందని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా గురువారం పురపాలక సంఘ కార్యాలయం నుంచి గార్లపాడు బస్టాండ్ సమీపంలోని మాతాజీ హోల్‌సేల్ పాలిథిన్ షాపు, ఇతర రిటైల్ పండ్ల బండ్లు వారిపై పురపాలక సంఘ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుమారు 40 కేజీల పాలిథిన్ వస్తువులు పట్టుబడటంతో వాటిని సీజ్ చేసి మున్సిపల్ కార్యా లయానికి తరలించారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అనేక అధ్యయనాల ప్రకారం జీవి మనుగడ కొనసాగడానికి పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపార సంస్థలు అవగాహన కలిగి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, పాల్గొన్నారు.



సీజ్ చేసిన పాలిథిన్ వస్తువులు చూపుతున్న కమిషనర్ ఆనంద్ కుమార్, ఎస్ఐ విజయసారథి

విద్యాబోధన, పరిశుభ్రతపై దృష్టి

జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ

నకరికల్లు: నాణ్యమైన విద్యాబోధన, పరిశుభ్రతపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఆదేశించారు. మండలంలోని చల్లగుండ్ల ఉన్నతపాఠశాలలో, నకరికల్లులోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినిలకు అందిస్తున్న ఆహారం, పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల వ్యక్తిగత ప్రగతిని పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వసతి గృహంలో భద్రతా ప్రమాణాలను పటిష్ఠంగా ఉంచాలన్నారు. రోజుకు రెండుగంటల పాటు స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో చల్లగుండ్ల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.



చల్లగుండ్ల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రకళ

డబ్ల్యూఏమ్ ఏపీ శాఖ ఉపాధ్యక్షుడిగా దివ్వెల



సత్తెనపల్లి: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (డబ్ల్యూఏఎమ్) ఏపీ శాఖ ఉపాధ్యక్షుడిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన సీనియర్ ఆర్యవైశ్య నాయకుడు, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆర్యవైశ్య సంఘాల్లో చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఆయనకు పదవిని కేటాయించారు. దివ్వెల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ప్రమాణస్వీకారం జరుగుతుందన్నారు. దివ్వెల శ్రీనివాసరావు నియామకంపై పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి

క్రోసూరు: గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలని క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక షాదీ ఖానా సమావేశ మందిరంలో ముగింపు పోషణ మాసోత్సవం నిర్వహించారు. పోషకాహార ప్రదర్శనతో పాటు పోషకాహార వంటల పోటీలు, కిశోర బాలికలకు తినే ఆహారం, పెరుగుదల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో విటమిన్లు రక్తహీనత పరిశుభ్రత వంటి అంశాలపై కిశోర బాలికలకు గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. భోజన పదార్థాల్లో నూనె, పంచదార, చెడు కొవ్వును పెంచే పదార్థాలను తక్కువగా వాడి పోషకాలు ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకోవాలన్నారు. పప్పు ఆకుకూరలు, కోడిగుడ్లు, రాగి పిండి, వేరుశెనగ చెక్కలు, ఎండు ఖర్జూరం, కాయగూరలు ఎక్కువగా వాడాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధకానికి తల్లిదండ్రులు గణనీయ పాత్ర పోషించాలన్నారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలోఎంపీపీ కోటయ్య, వేగుంటరాణి, ఏఎంసీ చైర్మన్ షేక్ జరినాబేగం, ఎంపీడీవో రవికుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసనలో సీడీపీవో వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, మహిళలు

నిబద్ధత, అంకితభావంతో రాణింపు

పెదకూరపాడు: క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధత, అంకితభావం ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నతంగా రాణించవచ్చని కాకతీయ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దివి లలితబాబు అన్నారు. పెద్దకూరపాడులోని కాకతీయ విద్యాసంస్థల్లో 23 సంవత్సరాలుగా లెక్కల మాస్టర్‌గా అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దిన షేక్ షరీఫ్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఆధ్వర్యంలో టీచర్స్ ఎక్సలెన్సీ అవార్డును ఇటీవల అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా షరీఫ్ అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో లలితబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా అందిస్తున్న సేవలను కొనియాడారు. కాకతీయ విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ శీలంనేని సాంబశివరావు, సొసైటీ ప్రెసిడెంట్ శీలంనేని ఇందిరా దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో లెక్కల మాస్టారు షేక్ షరీఫ్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

శ్వాసకోశ పునరుజ్జీవన చర్యపై అవగాహన ఉండాలి

ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్యపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో గురువారం కార్డియో పల్మనరీ రెసిటేషన్ (సీపీఆర్) పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ హృదయ స్పందన నిలిచిపోయిన తరుణంలో సీపీఆర్ అత్యవసర వైద్య ప్రక్రియ అని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండె కొట్టుకోవడం ఆగినప్పుడు, మెదడు, ఇతర ముఖ్య అవయవాలకు రక్తప్రసరణ నిలిచినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న తరుణంలో ఇది చేస్తారన్నారు. మొదటి 30 నిమిషాలు గోల్డెన్ అవర్స్ అని, ఈ సమయంలో చెప్పిన ప్రక్రియను చేసి ఆదుకోవాలన్నారు. ఎవరైనా విద్యుత్ షాక్, గుండెపోటుతో సడన్ కార్డియాక్ అరెస్టు వచ్చినప్పుడు సీపీఆర్ పద్ధతి ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. సదస్సులో డాక్టర్ గిరిరాజు, డాక్టర్ సుజాత మాట్లాడారు. అనంతరం వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ నర్సులు, వైద్యశాల సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ లక్ష్మణరావు

సీపీఆర్‌పై అవగాహన

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదలలో ఎంజేపీబీసీ బాలికల గురుకుల సంక్షేమ పాఠశాలలోని విద్యార్థినులకు గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై అవగాహన ఉండాలని చెప్పారు. సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, లింగవివక్ష అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దస్తగిరి, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సునీత, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఎస్టీయూ నాయకులు గురువారం ఎంఈవో బి.సత్యనారాయణసింగ్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లను క్రమబద్ధీకరించాలని కోరారు. పెండింగ్ బకాయిలు, సెలవుల తాలూకు బిల్లులు, ఎల్ఐసీ బిల్లులు త్వరగా మంజూరు చేయాలని కోరారు. వేసవి సెలవుల్లో చేసిన సంపాదిత సెలవలను సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సింగిల్ టీచర్ స్కూళ్లలో ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు సర్దుబాటు చేయాలన్నారు.

మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించండి

గోల్డ్‌లోన్ బాధితుల సంఘం

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో బంగారం కోల్పోయి నష్టపరిహారం అందకుండా మిగిలి ఉన్న రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని గోల్డ్‌లోన్ బాధిత రైతుల సంఘం కమిటీ ఆధ్వర్యంలో దొడ్లేరు మేనేజర్‌కు అర్జీ ఇచ్చారు. గురువారం జరిగిన కార్యక్రమంలో గోల్డ్ లోన్ బాధిత రైతు సంఘం కార్యదర్శి మహమ్మద్ షా మాట్లాడుతూ ఏళ్లుగా దొడ్లేరు సీజీజీబీ బ్యాంకులో రైతువారీగా లావాదేవీలు జరుపుకొంటున్నామని, అప్రైజర్ నాగార్జున అవినీతి కారణంగా బంగారం కోల్పోయి అనేక మంది రైతులు నష్టపోయామని ఆందోళన వ్యక్తపరిచారు. బ్యాంకులో అవతవకలు జరిగి రెండున్నరేళ్లు కావస్తున్నా ఇంకా పరిష్కారం కాకుండా మిగిలిన 109 మంది రైతులు చాలా ఆందోళన చెందుతున్నారన్నారు. అధిక వడ్డీల వైపు వెళ్లకుండా తమ బంగారం తాకట్టు పెట్టుకుని రుణాలు తీసుకోగా, కొంతమంది బంధువుల నుంచి కూడా తీసుకువచ్చి బంగారం తాకట్టు పెట్టామన్నారు. బ్యాంకులో జరిగిన ఘటన రైతులను చాలా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వెంటనే మిగిలిన 109 రైతుల సమస్యను పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ఈ సమస్య ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటికి బంగారం విలువ రూ.70 వేల నుంచి రూ. 1,30,000 వరకు పెరిగిందని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బ్యాంకు అధికారులు వారి బంగారాన్ని వారికే ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని, వీలుకాని పక్షంలో ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలా జరగకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఆ ఖాతాలపై 2023 ఖరీఫ్ నుంచిసమస్య పరిష్కారం అయ్యే తేదీ వరకు వడ్డీ రాయితీ చెల్లించి రైతులకు అండగా ఉండాలని కోరారు. బ్యాంకు అధికారులు వెంటనే పరిష్కరించి చాలని లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోల్డ్‌లోన్ బాధిత రైతుల సంఘం కమిటీ సభ్యులు అబ్దుల్ రవుఫ్, శిలార్స, ఈశ్వర్ రెడ్డి, బత్తుల కోటేశ్వరమ్మ , సయ్యద్ జానీ, గుత్తికొండ ఇమాంస తదితరులు పాల్గొన్నారు.



దొడ్లేరు సీజీజీబీ మేనేజర్ శివశంకర్‌నాయక్‌కు అర్జీ ఇస్తున్న గోల్డ్‌లోన్ బాధిత రైతు సంఘం కమిటీ

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

సత్తెనపల్లి: గ్రామీణ మహిళలు పారిశుద్ధ్యంపై అప్రమత్తంగా ఉండాలని పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లోని థీమ్ 5 అయిన పరిశుభ్రత, పచ్చదనంపై మండలంలోని ఒక్కో గ్రామానికి చెందిన ఇద్దరు వీవోఏలకు, ఇద్దరు స్వయం సహాయక సంఘాల సభ్యులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని వీవోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పరిసరాల పరిశుభ్రతపై అందరికీ అవగాహన కల్పించే బాధ్యత స్వీకరించాలన్నారు. పారిశుద్ధ్యంతో పాటు సీజనల్ వ్యాధులైన దోమ కాటుతో ప్రబలే మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై అవగాహనతో వ్యాపించకుండా తీసుకోవలసిన చర్యలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అధికారులతో అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసే ప్రక్రియను పూర్తిస్థాయిలో తెలుసుకోవాలన్నారు. వీటితో పాటు ప్రమాదకర చెత్తను వేరుచేసి ఎలా హరిత రాయబారులకు అందించాలో వివరించాలన్నారు. శిక్షణలో భాగంగా పరిశుభ్రత, పచ్చదనం, ఘన, పాలిథిన్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛరథం అనే అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు కుంబా వెంకటేశ్వర్లు, చెల్లంచర్ల శ్రీనివాసరావు, కాల్వపల్లి అంజిరెడ్డిలు మాస్టర్ ఆఫ్ ట్రైనర్లుగా వ్యవహరించారు. శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం ఎం.సమాధానం, అసిస్టెంట్ ట్రైనర్ చెంబేటి బొల్లయ్య, సత్తెనపల్లి మండలంలోని 25 గ్రామాలకు గాను 13 గ్రామాల వీవోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో వీవోలు, డ్వాక్రా మహిళలు

అమరావతి: మండల పరిధి గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం అభివృద్ధి చేయాలని పెరటితోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఎంపీడీవో పార్వతి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా వీవోలు, డ్వాక్రా సంఘాల మహిళలకు పచ్చదనం- పరిశుభ్రతపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

క్రోసూరు: గ్రామం పరిశుభ్రం ఉంచుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని క్రోసూరు ఎంపీడీఓ జి.రవి కుమార్ అన్నారు. పంచాయతీల పరిశుభ్రతపై రెండు రెండురోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరరావు శిక్షకులుగా వ్యవహరించారు.

కళాకారుడు బెజగంకు రెండు జాతీయ పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న కళాకారుడు బెజగం రవి కుమార్

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన రంగస్థల కళాకారుడు బెజగం రవికుమార్‌కు తెలుగు వెలుగు సాహితీ వేదిక భారత స్ఫూర్తికిరీటి అశోకచక్ర, విశ్వకర్మ కళాపీఠం వారి విశ్వకళాభూషణ్ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ నెల 15న తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో వెంకట కళా దీక్షితులు కళావేదిక ప్రాంగణంలో పోలోజు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందిన 100 మందికి పైగా కళాకారులకు జాతీయ గౌరవ పురస్కారాలు మహానంది, భారత స్ఫూర్తి కిరీటి అశోక చక్ర, నటరాజ పురస్కారాలను ప్రధానం చేశారు. సత్తెనపల్లికి చెందిన బెజగం రవికుమార్‌కు రెండు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఆయనతో పాటు సినీ పాటలు పాడిన సత్తెనపల్లి కళాకారుడు కె.నాగేశ్వరరావుకు విశ్వకర్మ జ్ఞాపికను బహూకరించారు. పురస్కార గ్రహీతలకు తలపాగా, శాలువా, పతకం, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రెండు జాతీయ పురస్కారాలను అందుకున్న బెజగం రవికుమార్‌ను పట్టణంలోని పలువురు కళాకారులు, కళా సంస్థల ప్రతినిధులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండలంలోని అన్నీ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ ఉంటుందని తెలిపారు.